
ప్రకటనలకు అనుమతి తప్పనిసరి: కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 19: సినిమా థియేటర్లు, టీవీ చానళ్లు, కేబుల్ టీవీల్లో రాజకీయ పార్టీలు జారీ చేసే ప్రచార ప్రకటనలకు ముందుగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందే మొదలై, కొనసాగుతున్న ప్రకటనలకు సైతం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 14,540 పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను, 38 హోర్డింగులను తొలగించినట్లు తెలిపారు. అలాగే 314 విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు.

వివాదాస్పద స్థలానికి పట్టాలు





- ఎన్నికల షెడ్యూల్‌కు ముందు గుట్టుగా జారీ
- రైతులు ప్రశ్నించడంతో వెలుగులోకి..
- ఆ భూములపై ఇప్పటికే స్టేటస్ కో ఉత్తర్వులు
- వైసీపీ నేతలు ఉండడంతో పట్టని యంత్రాంగం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం మండలం జమ్మునారాయణపురం రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూముల్లో ఎన్నికల షెడ్యూల్ రాకముందు గుట్టుగా కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు తెలిసింది. అధికార పార్టీ కీలక నాయకుల అండతో ఇది జరిగింది. విషయం తెలుసుకున్న రైతులు తిరగబడడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. జమ్మునారాయణపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 3, 4లో 25.13 ఎకరాలున్నాయి. ఆ భూమిని నాలుగు కుటుంబాలకు చెందిన 63 మంది సాగు చేసుకునేవారు. 2019లో ఈ భూమిపై వివాదం రావడంతో కొందరు రైతులు హైకోర్టులో కేసు వేశారు. అప్పటి నుంచి జీడి, నీలగిరి తోటలు పెరుగుతున్నాయి. కొద్దిరోజుల కిందట ఆ చెట్లను కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి తొలగించారు. ఆ భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నట్లు అధికార పార్టీ నాయకులు చెప్పుకొస్తూ కబ్జా వ్యూహం పన్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ఒకటిరెండు రోజులు ముందు ఇళ్ల పట్టాలు ఇచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తాము దశాబ్దాలుగా సాగులో ఉన్నామని, భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, వేరొకరికి పట్టాలు ఎలా ఇచ్చేస్తారని ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా సాగుదారులుగా తమ పేర్లు నమోదై ఉన్నట్లు రైతు నక్కాన సాయికుమార్ తెలిపారు. ఇటీవల మరోసారి కూడా కోర్టు నుంచి స్టేటస్కో ఉత్తర్వులు తీసుకువచ్చామన్నారు. రెండో కంటికి తెలియకుండా చెట్లు కొట్టేసి.. నేలను చదును చేసేసి.. ఇళ్ల పట్టాలు ఇవ్వడంపై విస్తుపోతున్నారు. ఈ భూములు తమవంటూ నక్కాన అప్పయ్యమ్మ, పార్వతి, సూరప్పడు, సూరిబాబులు కోర్టుకెళ్లారు. తమ భూమిని చదును చేస్తున్నారని దురాక్రమణకు గురవుతున్నదని గతేడాది డిసెంబరు 11న కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చదును చేసే పనులు ఆగలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్టేటస్కో తీసుకువచ్చినా అధికార బలంతో తమకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కాపాడి తమకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. భూముల రేట్లు పెరగడం తమ పాపమా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఏడాది కాలంగా వైసీపీ నాయకులు ఓట్ల రాజకీయాల కోసం పట్టణ శివార్లలో ఉన్న స్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించేసి పొజిషన్ పట్టాలు ఇస్తున్నారు. మరోవైపు నచ్చినకాడికి కబ్జాలు చేస్తున్నారు. ఫూల్‌బాగ్ ఊటగెడ్డ ప్రాంతంలో గెడ్డ పరీవాహక ప్రాంతంలో పునాదులు వేశారు. గెడ్డ వస్తే అవి కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఇలా పట్టణ శివార్లలో ఉన్న చెరువులు, వాగులు.. వంకలను సైతం కబ్జా చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో అడిగే నాథుడు, స్పందించే అధికారులు లేరు.



ఈ స్థలంపై స్టేటస్‌కో ఉత్తర్వులున్నాయంటూ బోర్డు ఏర్పాటుచేసిన రైతులు

ఎవరి డప్పు వారిదే

- ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో ప్రచార హోరు..

విజయనగరం(ఆంధ్రజ్యోతి), మార్చి 19: ఎన్నికల షెడ్యూల్ వచ్చేయడంతో అభ్యర్థులు స్పీడు పెంచుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే వ్యూహాల్లో మునిగారు. ఎవరి డప్పు వారు కొట్టేందుకు కొత్తకొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. ప్రజలను నేరుగా కలియడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా ఇంట్రాక్ట్ అయ్యేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. సొంతగా ఫొటో, వీడియోగ్రాఫర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. యూట్యూబ్ చానళ్లు, ఎక్స్ వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర వాటితో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. వాట్సాప్ గ్రూపులను విస్తృతంగా క్రియట్ చేస్తూ ఒక్కో గ్రూపులో సుమారు 1000 మంది వరకు చేర్చుతూ వారే ఆడ్మిన్‌లుగా ఉంటూ ప్రచారం ఆరంభించారు. ఫోన్‌నెంబరు తెలిస్తే చాలు వారి అనుమతితో పనిలేకుండా.. గ్రూపులో యాడ్ చేస్తున్నారు. జిల్లాలోని ఓ పార్టీకి చెందిన అభ్యర్థి ఏకంగా ఈవినింగ్ పేపర్‌ను పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. గడిచిన ఐదేళ్లలో తాను చేసిన పనులను, గెలిస్తే పట్టణంలో చేయబోయే పనులపై సొంత డప్పు కొట్టుకునేందుకు రంగం సిద్ధం చేశారు. సహజంగానే ఆయనకు ప్రచారమంటే మక్కువ. ఈ క్రమంలోనే ఎన్నికలు అయ్యేంతవరకు కొంతమంది వ్యక్తులతో కలిసి ఓ పేపర్ పెట్టుకుంటున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది.



జిల్లాలో భారీ వర్షం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- నేడూ భారీ వర్ష సూచన

విజయనగరం(ఆంధ్రజ్యోతి), మార్చి 19: ద్రోణి ప్రభావంతో జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. గాలులు వీస్తూ పిడుగులు కూడా పడ్డాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో చిరు జల్లులే పడతాయని భావించారు. కానీ మధ్యాహ్నం నుంచి ఉరుములు మొదలయ్యాయి. అనేక చోట్ల భారీ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు ప్రజలను భయపెట్టాయి. ఈ వర్షాలు మామిడి, పత్తి, రబీ వరి, ఇతర ఉద్యాన పంటలకు ఉపయోగమంటున్నారు. కాగా రానున్న రెండురోజులూ ఓ మోస్తరు నుంచి భారీ వాన పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. పలు చోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



చీపురుపల్లిలో నేలకొరిగిన లైటింగ్ సెట్టు

పిడుగు పడి గాయాలు

గుర్ల: గూడెం, తెట్టంగి గ్రామాల సరిహద్దులో పంట పొలాల్లో మంగళవారం సాయంత్రం పిడుగుపడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తోట బంగారయ్య, సత్తిబాబులు పంట పొలాల్లో ఆవులు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో వారికి సమీపంలో పిడుగు పడింది. ఆ దాటికి ఇద్దరూ స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

జాతరలో నేలకొరిగిన లైటింగ్ సెట్టు

చీపురుపలి: చీపురుపల్లిలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. మూడు గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం నాలుగున్నర వరకూ ఏకధాటిగా కురిసింది. వడగళ్లతో కూడిన వర్షంతో పాటు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కనకమహాలక్ష్మి జాతరలో ఆకర్షణ కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ సెట్టు రోడ్డుకు అడ్డంగా నేలకొరిగింది.

పైడితల్లి.. భక్తజనం ప్రణమిల్లి



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులుతీరిన భక్తులు

ఘనంగా ముగిసిన అమ్మవారి జాతర

రాజాం/రూరల్, మార్చి 19: పైడితల్లి అమ్మవారి జాతర చివరిరోజు మంగళవారం భక్తజన సంద్రమైంది. రాజాం పట్టణమంతా కిటకిటలాడింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి దాటాక చేపట్టిన ఘటోత్సవం వరకు ఆలయం లోపల, బయట భక్తజన కోలాహలమే కనిపించింది. అయితే మంగళవారం మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి భక్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. చిరు వ్యాపారులు కూడా డీలాపడ్డారు. కాగా పైడితల్లి అమ్మవారిని టీడీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, శ్రీలక్ష్మి దంపతులు దర్శించుకుని పసుపు, కుంకుమ, వస్త్రాలు అందజేశారు. టీడీపీ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్న క్యాంటీన్‌కు అభ్యంతరం

- ఎన్నికల కోడ్ పేరుతో అడ్డుకున్న అధికారులు
- నిరాశ చెందిన పేదలు
- నడిపేలా అవకాశం ఇవ్వాలని కూలీల విన్నపం



- నా పేరు పల్లా దుర్గారావు. రోజు కూలీని. నాకొచ్చే డబ్బులు ఇంటి ఖర్చులకే సరిపోవు. అన్నక్యాంటీన్ వద్ద ఉచితంగా ఆహారం దొరుకుతుండడంతో భోజన సమయానికి ఇక్కడికి వస్తున్నాను. పట్టణంలో పనిచేస్తున్న రోజువారి కూలీలు ఎంతోమంది ఇక్కడే తింటున్నారు.



- నాపేరు గొర్లె ముత్యాలమ్మ. స్థానిక పుణ్యగిరి దారగంగమ్మ ఆలయం వద్ద నివాసం వుంటున్నాం. నిరుపేద కుటుంబం కావడంతో ప్రతి రోజు మధ్యాహ్నం అన్నక్యాంటీన్ వద్దకు వచ్చి భోజనం చేస్తున్నాం. ఒక పూట వంట తప్పడంతో సంపాదనలో కొంత మిగుల్చుకొంటున్నాం.

శృంగవరపుకోట, మార్చి 19

ఎన్నికల కోడ్ అంటూ ఎస్.కోట అన్నక్యాంటీన్ సేవలకు అధికారులు అభ్యంతరం తెలిపారు. రోజులాగే మంగళవారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన కూలీలు, విద్యార్థులు మూసి ఉన్న క్యాంటీన్ చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన నేతల బొమ్మలు, ఫ్లెక్సీలను పట్టించుకోని యంత్రాంగం పేదల కడుపునింపే అన్న క్యాంటీన్‌ను అడ్డుకోవడాన్ని తప్పుపట్టారు.

తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు తక్కువ ధరకే పేదలకు భోజనం పెట్టాలన్న లక్ష్యంతో పట్టణ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో రూ.5కే భోజనం అందించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని మూసేశారు. ప్రైవేటు స్థలాల్లో క్యాంటీన్ లను ఏర్పాటు చేసినా ఇబ్బందులు సృష్టించేవారు. ఎలాగైనా పేదలకు భోజనం అందించాలని, అధికార పార్టీని ఎదురించైనా అన్నక్యాంటీన్‌లను నడపాలని చంద్రబాబు ఇచ్చిన పిలుపుతో తొలుత బొబ్బిలిలో బేబీ నాయన అన్నక్యాంటీన్ సేవలను ప్రారంభించారు. పలు అవాంతరాల తర్వాత శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గత ఏడాది ఆగస్టు 3న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామప్రసాద్ దంపతులు అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిరోజూ మధ్యాహ్నం ఉచితంగా భోజనం పెడుతున్నారు. నిత్యం 300 మంది పేదలు, కూలీలు అక్కడ భోజనం చేస్తున్నారు. ఇలా 229 రోజుల పాటు పెట్టారు. భోజన సేవలను నిలిపేయాలని సోమవారం అధికారులు ఆదేశించడంతో మంగళవారం నుంచి తాత్కాలికంగా ఆపేశారు.



తెరవరని తెలియక ఎస్.కోట అన్నక్యాంటీన్ వద్దకు భోజనానికి వచ్చిన పేదలు

నిబంధనల ప్రకారం ఆపాల్సిందే..

ఎన్నికల నిబంధనల ప్రకారం అన్నక్యాంటీన్ సేవలు ఆపాల్సిందే. రాజకీయ పార్టీలతో ముడిపడి వున్న ఎటువంటి సేవలైనా ఎన్నికల నిబంధనలకు లోబడే ఉండాలి. ఓటర్లను ప్రభావితం చేసేదేదైనా అడ్డుకుంటాం. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పక్కా అమలు జరగాల్సిందే.

-మురళీకృష్ణ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శృంగవరపుకోట

ఐదేళ్లలో తిరోగమనంలోకి రాష్ట్రం

● అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనని గెలిపించాలని కోరుతూ అదితి గజపతిరాజు నగరంలోని ఐదో డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నాగరాజు, ఆ డివిజన్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎన్నికల కార్యాలయాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్ల కాలంలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. తి రోగమనంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని పురోగమనంలోకి తీసుకు వెళ్లాలంటే చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ నాయకుడు అవసరమన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నగర నాయకులు, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, అదితి యువసేన నాయకులు, ప్రతినిధులు పసుపు రంగు టీ షర్టుని ధరించి, ప్రచారంలో పాల్గొన్నారు. ఆమె బాబామెట్టలోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వివరించారు. ఐదో డివిజన్ పరిధిలో ప్రచారం నిర్వహించిన అదితి గజపతిరాజుకి అడగడుగునా ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చి ఆమెను ఆశీర్వదించారు. ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు కటౌట్లను కార్యకర్తలు పట్టుకుని ప్రచారంలో ముందుకు సాగారు. ఈ కటౌట్లతో పాటు, రాజులు ధరించిన ప్రత్యేక పసుపు టోపీలను కూడా కార్యకర్తలు ధరించి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ ప్రచారం

విజయనగరం రూరల్: విజయనగరంలోని 49వ డివిజన్‌లో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మామిడి రవి శంకర్, కండువా ప్రకాష్, శంకరావుతో పాటు నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు.

ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్

విజయనగరం రూరల్: విజయనగరంలోని అన్ని రీడింగ్ రూంలకు తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్న పరిశ్రమలు మూతపడినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పోగిరి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బేబీనాయన ప్రచారం

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) బుధవారం ఉదయం స్థానిక రాజానగర్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన మూడు పార్టీల శ్రేణులంతా స్థానిక సంతతోటకు బుధవారం ఉదయం 7.30 గంటలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న రాయవరపు చంద్రశేఖర్

శృంగవరపుకోట: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం శృంగవరపుకోటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కార్యాలయం వద్ద కార్యకర్తలతో సమావేశమయ్యారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రయితేనే మహిళలకు రక్షణ, యువతకు ఉద్యోగాలు, రైతులకు వ్యవసాయ సదుపాయాలు వంటివి కలుగుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గ్రామాల్లో వివరించాలని కోరారు. నాయకులు జుత్తాడ రామసత్యం, అడారి రమేష్, మాదిబోయిన మంగరాజు తదితరులు వున్నారు.

పేదలకు చీరల పంపిణీ

జామి: మండలంలోని అట్టాడలో వున్న బీఎన్ఆర్ ఆశ్రమం అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని భీశెట్టి ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. మంగళవారం ఈ ఆశ్రమం నాల్గో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా నిత్యాన్నదానం చేస్తూ మండలంలో వైద్యశిబిరాలు, విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవకు మరో రూపంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో దవడ మీనా, కొండబాబు, ఆశా మహాలక్ష్మి, ఆళ్ల శిరీష, హరిత తదితరులున్నారు.

బాడంగిలో పారిశుధ్య పనులు



పూడికలను తొలగిస్తున్న దృశ్యం

బాడంగి, మార్చి 19: మండల కేంద్రంలోని బాడంగిలో టీడీపీ సర్పంచ్ కంది రమేష్ దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కాలువల్లోని ఊడికలను తీయించి గ్రామానికి సుదూరంగా పారవేయించారు. అలాగే మురుగునీటి గుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే రోడ్లపై ఉన్న చెత్తను కూడా పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగించారు.

గర్భిణులకు యోగా శిక్షణ



యోగాపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: స్థానిక మల్లమ్మపేట రెండో సెక్టారు పరిధి 22, 23 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. గర్భిణులకు యోగాపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి, సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీసీల పక్షపాతి



పార్టీలో చేరిన వారితో అదితి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

రాజాం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళ వారం శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పనులు ప్రారంభించి నేటికి ఏడాది కావస్తున్నా ఇంతవరకు పూర్తిచేయలేని దౌర్భాగ్యపు పరిస్థితి ఏర్పడిం దన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకు వస్తే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుం దన్నారు. పార్టీ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, నాగళ్ల అప్పలనాయుడు, గ్రంధి గోపి, రగుమండల గణపతినాయుడు, కడగల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక..

పెనుబాక గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి మాజీ సర్పంచ్ చీడికుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాల యంలో కోండ్రు మురళీమోహన్ వారికి పార్టీ కండువా వేసి, పార్టీలోకి ఆహ్వా నించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని, అవినీతి, దోపిడీలో అధికార వైసీపీ నేతలు పోటీపడ్డారని ఆదివారం నిర్వహించిన ఎన్డీఏ సభ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారన్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరైన సభ వద్ద ప్రజా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీసులు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరా రు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి చిన్నారావు, రాము, శ్రీను, వజ్జిపర్తి రాము, ఇందుగు బల్లి సూర్యనారాయణ, చిలకలపల్లి రమణ, తదితరులు టీడీపీలో చేరారు.

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే వీరభద్రస్వామి ఏకపక్ష నిర్ణయాలు.... ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగుచెంది నగరంలోని 8, 12, 27, 31, 40 డివిజన్లకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి మంగళవారం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆ డివిజన్లకు చెందిన పి.రామలక్ష్మి, వి.చంద్రావతి, పడగల అంజిబాబు, ఆర్.రాజు, జి.మోహన్, శివ, కె.సుబ్బారావు, సీహెచ్.జోగారావు, ఎం హేమంత్‌బాబు, పి.మహేష్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులు, అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు నచ్చి, టీడీపీలో చేరడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సూపర్ సిక్స్ పథకాలతో శాశ్వత ప్రయోజనం



ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

దత్తిరాజేరు: టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని విజయరాంపురం, షికారు గంజి గ్రామాల్లో ఆయన మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. వర్షంలో ప్రచారం చేస్తున్న ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కూటమి గెలు పే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశే ఖర్, కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మండల నాయకులు పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జి పెద్దింటి జగన్, పార్టీ సీనియర్ నాయకులు గుసిడి జగన్నాథం, చెల్లూరి సత్యారావు, గుసిడి వేణు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం



మత్స్యకారులతో మాట్లాడుతున్న లోకం నాగమాధవి

భోగాపురం: మత్స్య కారులను అన్ని విధాలా ఆదుకుంటామని జనసేన, టీడీపీ బీజేపీ పార్టీల నెల్లి మర్ల నియోజకవర్గ ఎమ్మె ల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి అన్నారు. ముక్కాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు మత్స్యకారులంటే ఎం తో అభిమానమని, వారి హక్కుల కోసం ప్రతిక్షణం పరితపించే పార్టీ జన సేన పార్టీనే అన్నారు. బద్దుకొండకు ఇంకోసారి చాన్స్ ఇస్తే నియోజకవర్గాన్ని ని లువునా దోచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వరుపుల సుధాకర్, మైలపల్లి అప్పలకొండ, మండల కోఆర్డినేటర్ పల్లంట్ల జగదీష్, జన సైనికులు పాల్గొన్నారు.

'ప్రజాగళం' భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

శృంగవరపుకోట, మార్చి 19: ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. మంగళవారం శృంగవరపుకోటలో విలేకర్లతో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడ ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాదిమంది ప్రజలు తోసుకోస్తుంటే నియంత్రించాల్సిన పోలీస్‌లు చోద్యం చూడడం దేనికి సాంకేతికమని ప్రశ్నించారు. కూటమి సభ విజయవంతమైందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, దోపిడిలో వైసీపీ నేతలు పోటీ పడ్డారని ఈ సభ ద్వారా ప్రధాన మంత్రి స్పష్టం చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగానే జగన్ ప్రభుత్వం సభకు అడ్డంకులు సృష్టించిందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, నాయకులు భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, చెక్క కిరణ్ కుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి

పోలీసులు తటస్థంగా వ్యవహరించాలి

విజయనగరం రూరల్: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడిగా గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన సభ విజయవంతమైందని ఆ పార్టీల విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. ప్రధాని మోదీ హాజరయ్యే సభకు పోలీసు భద్రత అంతంత మాత్రంగా ఉందని, పోలీసుల్లో కొంతమంది తటస్థంగా వ్యవహరించకుండా ఇంకా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కంది మురళీ నాయుడు, ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల ఓటమి కోసమే పనిచేస్తాం

● అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీ శంకర్

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. మంగళవారం అనుచరులతో కలిసి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి నగరపాలక సంస్థ, తహసీల్దారు కార్యాలయాలు కబ్జా చేశారని, నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లను డమ్మీ చేస్తూ, వీరభద్రస్వామి తన అనుచరులతో అన్ని పనులు చక్కబెట్టారన్నారు. పనికో రేటు పెట్టి హోల్‌సేల్‌గా దోచుకున్నారన్నారు. చిన్న ఇల్లు కట్టుకునే వాడి నుంచి అపార్టుమెంట్ నిర్మాణాలు చేసే వారి వరకూ ఎవరినీ వదలకుండా డబ్బులు గుంజేశారన్నారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి తేలేదని, గత పాలక వర్గం ఖర్చు చేయకుండా వదిలేసిన రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు తన సొంత నిధుల్లా వ్యయం చేశారన్నారు. అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంకు రోడ్డు కూడా టీడీపీ హయాంలోనిదేనని, ఎమ్మెల్యే ముచ్చటగా మూడు సార్లు కొబ్బరి కాయలు కొట్టేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఓటమే లక్ష్యంగా తాను, తన అనుచరులు పనిచేస్తామని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ స్పష్టం చేశారు. తిరిగి ఆయననే విజయనగరం ప్రజలు గెలిపిస్తే మిగిలేది నరకమేనన్నారు.. రానున్న ఎన్నికల్లో అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న గౌరీ శంకర్

నగర ప్రజల సమస్యలు పరిష్కరించాలి

● అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావుకు టీడీపీ నేతల వినతి

విజయనగరం రింగురోడ్డు: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ తిరుమలరావుకు టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లా డుతూ ఎన్నికల షెడ్యూల్‌కి ముందు నగర పాలక సంస్థలో నియంతృత్వం, దళారీల వ్యవస్థ ఉండేదన్నారు. ఏ పని జరగాలన్నా ప్రజాప్రతినిధి అనుమతి అవసరం ఉండేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి పాలన అంటే నిరంకుశత్వమే అన్నారు. కార్పొరేటర్లకు తగిన గౌరవం ఉండేది కాదని గుర్తు చేశారు. నియమాలకు విరుద్ధంగా ధనం విచ్చలవిడిగా దుర్వినియోగమైందని ఆరోపించారు. ప్రజలు కట్టిన పన్నులు పక్కదారి పట్టాయన్నారు. ఇప్పటికైనా న్యాయపరంగా, చట్టపరంగా ప్రజలకు అందించాల్సిన సేవలు, ఇంటి ప్లానులు, అపార్టుమెంటు ప్లానులు, శానిటేషన్, పచ్చదనం, పరిశుభ్రత, ఉద్యోగులకు సకాలంలో జీతాలు, ఇతర అలవెన్సులు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల కోడ్‌ను సక్రమంగా పాటించాలని కోరారు. ఇదిలా ఉండగా...విజయనగరం రెవెన్యూ కార్యాలయంలో అస్తవ్యస్త, నియంతృత్వ పాలన నడిచేదని, వీటిని సరిచేసి, ఎలక్షన్ నిబంధనలు పాటించాలని టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు హెచ్‌డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.



కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రం చూపిస్తున్న టీడీపీ నాయకులు

కోడ్‌పై అవగాహన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బొబ్బిలి: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం తహసీల్దారు విశ్రినాథరావునాయుడు ఆధర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు సూచనలు చేయవచ్చన్నారు. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారులు రెడ్డి సాయికృష్ణ, సుబ్బారావు, వైసీపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు పక్కి చంద్రమౌళి, మువ్వల శ్రీనివాసరావు, పి.శంకరరావు, మునకాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలువల్లో సిల్ట్‌ను తొలగించండి



వార్డు సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణం లోని ఆకులరెల్లివీధి, సంఘ వీధి, చాకలి వీధి, దిబ్బవీధి, మేదరబంద జంక్షన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. కాలువల్లో పేరుకుపో యిన సిల్ట్‌ను ఎప్పటి కప్పుడు తొలగించాలని, మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చూడాలని పారిశుధ్య సి బ్బందిని ఆదేశించారు. పాకీ వీధిలో నిర్మిస్తున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. మేదరబంద జంక్షన్‌లో పారిశుధ్య లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహసమనే చెప్పాలి!

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 19: కిక్కిరిసిన బస్సులోకి సాహసోపేతంగా తట్టబుట్ట, నెత్తిన పెట్టుకుని ఎక్కిన మహిళలు ప్రయాణం సర్కస్ ఫీట్‌ను తలపించింది. వివరాల్లోకి వెళితే పూసపాటిరేగ మండలం నుంచి నగరానికి చేపలు అమ్ముకునేందుకు వచ్చిన మహిళలు సరుకు చెల్లిపోయిన తరువాత.. ఇంటికి పయనం అయ్యారు. ఏ బస్సు ఖాళీగా లేకపోవటంతో సుమారు గంటనుంచి ఇద్దరు మహిళలు బస్‌కోసం వేచిచూశారు. వారు వెళ్లాల్సిన బస్సులు కాలీగా లేక, ప్రయాణికులు ఫుట్‌పాత్ ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో చేసేది ఏమీలేక కిక్కిరిసిన బస్సులో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. ఏలాగైనా బస్సు ఎక్కేందుకు నడుం బిగించారు. దీంతో ఫుట్‌పాత్‌పై వేలాడుతున్న విద్యార్థులను నెట్టుకుంటూ, తట్టాబుట్టా పట్టుకుని నెట్టుకుంటూ బస్సు ఎక్కేశారు.





చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● పరారీలో ఐదుగురు ● 19 తులాల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

బెలగాం, మార్చి 19: మన్యం జిల్లాలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఒక నిందితుడిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మంగళవారం విలేకరులకు వివరించారు. గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలో ఫిబ్రవరి 26న వేకువజామున కిమిడి శ్రీరామమూర్తి ఇంటిలో చోరీ జరిగింది. ఆరుగురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి సుమారు 87 తులాల బంగారు ఆభరణాలు, 50 వేలు నగదును చోరీ చేసి పరారయ్యారు. తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటనపై పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చోరీ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించారు. వీరిలో గరుగుబిల్లికి చెందిన ఒక వ్యక్తి, బొబ్బిలికి చెందిన ఒకరు, తూర్పుగోదావరికి చెందిన ఒకరు, పశ్చిమబెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను ముద్దాయిలుగా గుర్తించారు. ఈ నెల 18న బొబ్బిలిలో ప్రధాన నిందితుడైన శంకరాపు నారాయణను అరెస్ట్ చేసి, సుమారు 19 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, ఈ కేసులో నిందితులకు గతంలో నేర చరిత్ర ఉందని ఎస్పీ తెలిపారు. దర్యాప్తు బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించిన పోలీసులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఎస్పీ కృష్ణారావు, ట్రైనింగ్ డీఎస్పీ అజీజ్, సీఐలు కె.రవికుమార్, బి.మంగరాజు పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

● హత్య చేశారంటూ తల్లి ఆరోపణ



చంద్రశేఖర్ (ఫైల్)

విజయనగరం క్రైం: తండ్రి ఈ ఏడాది జనవరిలో మరణించారు. ఇంకా ఆ షాక్ నుంచి కుటుంబం తేరుకోనే లేదు. ఈలోగా ఒక్కగానొక్క కొడుకు.. పొట్టిపిరెడ్డి పూర్ణ చంద్రశేఖర్ (26) రైలు పట్టాలపై విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లి వెంకటరమణమ్మ దీనంగా రోదిస్తోంది. వివరాల్లోకి వెళితే... కోరుకొండపాలేనికి చెందిన పొట్టిపిరెడ్డి సింహాద్రినాయుడు, వెంకట రమణమ్మలకు ఏకైక కుమారుడు చంద్రశేఖర్. ఆయన హైదరాబాద్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. ఇటీవల తండ్రి అనారోగ్యం కారణంగా సొంత గ్రామం కోరుకొండపాలెం వచ్చాడు. తగరపువలసలోని క్యాటరింగ్ సర్వీసులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో తండ్రి సింహాద్రినాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా... ఈ నెల 18న కోరుకొండలోని ఎల్లమ్మ జాతరకు స్నేహితులతో కలిసి చంద్రశేఖర్ వెళ్లాడు. తిరిగి ఉదయం ఇంటికి రాకపోవడంతో స్నేహితుడు గోవింద్‌కు తల్లి ఫోన్ చేసింది. ఇంటికి వచ్చి తల్లికి కోరుకొండపాలెంలో గొడవ జరిగిందని తెలిపాడు. ఈలోగా రైలు పట్టాలపై కుమారుడు చంద్రశేఖర్ మృతదేహం ఉందని తెలియడంతో వెంకటరమణమ్మ సంఘటన స్థలానికి వెళ్లింది. కుమారుడు విగతజీవిగా ఉండడం చూసి కన్నీరుమున్నీరైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్టుగా కేసు నమోదు చేశామని జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపారు. మృతుడి తల్లి తన కుమారుడిని ఎవరో చంపి రైలు పట్టాలపై పడేసి ప్రమాదంగా చిత్రీకరించే విధంగా చేశారని ఆరోపించారు. దీనిపై ఎస్‌ఐ రవివర్మ వివరణ కోరగా, విచారణలో నిజాలు వెల్లడవుతాయని తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

డెంకాడ, మార్చి 19: చదువులో ఫెయిల్ అవడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి డెంకాడ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి సమీపంలోని రఘు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న షేక్ లాల్ మజాక్(21) ఇంజినీరింగ్ 4వ సంవత్సరం పూర్తి చేసుకున్నప్పటికీ కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్థాపానికి గురై మంగళవారం తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం మండలంలోని జొన్నాడ సమీపంలో ప్రైవేటు లేఔట్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిది ఎన్‌టీఆర్ జిల్లా నందిగాం గ్రామం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజాం రూరల్: పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వీరిలో కొండపేట గ్రామానికి చెందిన వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై రాజాం నుంచి బలిజిపేట వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గాయాలయ్యాయి. వెంకటరమణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటరమణ తండ్రి నాగభూషణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురంలో మాల్‌ప్రాక్టీస్

వంగర: సీతారాంపురం పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి మంగళవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ తనిఖీ బృందానికి పట్టుబడ్డాడు. ఈ మేరకు ఇన్విజిలేటర్, కొండచాకరాపల్లికి చెందిన నాగరాజును బాధ్యతల నుంచి తప్పించినట్టు పరీక్షల నిర్వహణాధికారి ఆనంద్‌రావు తెలిపారు.

కోడిపందేలపై దాడులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట శివారులో కోడిపందాల శిబిరంపై ఎస్‌ఐ వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సాయంత్రం దాడిచేశారు. ఈ దాడిలో 8మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని ఐదు కోడిపుంజులు, రూ.4690 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బంగారం షాపుల్లో మోసాలు

● విజిలెన్స్ విచారణకు డిమాండ్

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని కొన్ని బంగారు షాపుల నిర్వాహకులు వినియోగదారులను మోసగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం, లోక్‌సత్తా నాయకులు పి.శంకరరావు, ఆకుల దామోదరరావులు డిమాండ్ చేశారు. కోమటిపల్లికి చెందిన సత్తి జయమణి అనే వృద్ధురాలు ఐదు నెలల కిందట ఓ బంగారం షాపులో సుమారు రూ.40 వేల విలువైన ఆభరణాలను కొనుగోలు చేసిందన్నారు. ఆ బంగారాన్ని మార్చాలని కోరుతూ తాజాగా షాపునకు వెళ్లిందని... అసలు బంగారానికి బదులుగా నకిలీ బంగారం తిరిగి ఇస్తూ తనను మోసగించారని ఆమె లబోదిబోమంటూ పోలీసు స్టేషన్ ముందు కన్నీరుమున్నీరుగా విలపించిందన్నారు. బొబ్బిలిలో గల కొన్ని బంగారం షాపులపై ఈ తరహా ఆరోపణలు చాలా ఏళ్ల నుంచి ఉన్నాయని, కస్టమ్స్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపి పారదర్శకంగా బంగారం అమ్మకాలు, కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే దేశానికి ఉజ్వల భవిష్యత్

బొబ్బిలి: దేశంలో కాంగ్రెస్ పరిపాలన వస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని పీసీసీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాజచెరువువలస గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇటీవల ప్రకటించిన ఎన్నికల హామీలను వివరించారు.

మెరుగైన వైద్యం అందించాలి



హెచ్‌ఏలతో మాట్లాడుతున్న ఏడీ

వేపాడ: రైతు భరోసా కేంద్రాల పరిధిలోని హెచ్‌ఏలంతా పశువులకు మెరుగైన వైద్యం అందజేయాలని శృంగవరపుకోట ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకులు చలపతిరావు ఆదేశించారు. నీలకంఠాపురం గ్రామ సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ హెచ్‌ఏలు సక్రమంగా విధులకు హాజ రు కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో సిబ్బంది, హెచ్‌ఏలు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిబంధనలు అమలు చేయాలి

బొబ్బిలి: ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ప్రకటనలు, ఫొటోలు, జెండాలు తొలగించాలని అధికారులను కోరారు.

జామి: జామి గ్రామంలో ఇంకా చాల ఇళ్లపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు దర్శనం ఇస్తున్నాయి. ప్రతిరోజు ఈదారిలో తిరిగే అధికారులకు, సిబ్బందికి ఎందుకు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కూరగాయల మార్కెట్‌లో దళారుల హవా

- రైతులు నేరుగా అమ్ముకోలేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

గజపతినగరం: స్థానిక కూరగాయల మార్కెట్‌లో దళారుల హవా కారణంగా రైతులు తమకు నచ్చిన ధరలకు కూరగాయలు అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. రైతులు ఆరుగాలం పండించిన కూరగాయల పంటలను దళారుల చేతికి వెళ్లకుండా, తమకు నచ్చిన ధరకు అమ్ముకుని, లాభసాటిగా ఉండే విధంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతుబజారును ఏర్పాటు చేశారు. గజపతినగరం మండలంతో పాటు చుట్టు పక్కల దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల నుంచి రైతులు నేరుగా మార్కెట్‌కు కూరగాయలను తీసుకువచ్చి విక్రయించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అందుకు అప్పట్లో రూ.2లక్షల వ్యయంతో షెడ్లతో పాటు మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం కల్పించారు. అందుకు రైతులు కూడా నేరుగా మార్కెట్‌యార్డుకు కూరగాయలను తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టేవారు. దీంతో పేద, మధ్య తరగతులకు కూరగాయలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ చొరబడడంతో కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. గజపతినగరం, విజయనగరం పట్టణ ప్రాంతాలకు చెందిన దళారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి వాటిని నచ్చిన ధరకు అమ్మకాలు చేపడుతున్నారు. అయినా వ్యవసాయ మార్కెట్ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు వాపోతున్నారు. పండించిన రైతుకు లాభసాటి రాకపోగా వినియోగదారులు చుక్కలు చూస్తున్నారని, దళారులే లాభపడుతున్నారని పలువురు వాపోతున్నారు. ప్రతిరోజూ కూరగాయల మార్కెట్‌లో ఏ కూరగాయలు ఎంత ధర పలుకుతోందో బోర్డుపైన రాసి ఉంచాలి. బోర్డుపైన ఉన్న ధరలకే విక్రయాలు చేపట్టాలి. కానీ ఆ విధంగా జరగడంలేదు. దళారులు నిర్ణయించిన ధరకే వినియోగదారులు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో చాలామంది రైతులు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద తెల్లవారుజామున వచ్చి తెచ్చిన కూరగాయలను విక్రయించి వెళ్లిపోతున్నారు.

మౌలిక సదుపాయాలూ లేవు

ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించే పరిస్థితులు లేవని రైతులు వాపోతున్నారు. తమ సొంత డబ్బులతో షెడ్లు వేసుకుని కూరగాయలను నిల్వ ఉంచుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌లో ధరల నియంత్రణ చేపట్టి, వినియోగదారులకు అందుబాటులో ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కూరగాయల విక్రయాలు

చర్యలు తీసుకుంటాం

కూరగాయల రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం. తాగునీరు, మరగుదొడ్ల సదుపాయం కల్పించాం. దళారీ వ్యవస్థను నిర్మూలించే దిశగా చర్యలు తీసుకుంటాం.
- వై.మురళి, ఏఎంసీ సూపర్‌వైజర్, గజపతినగరం

పైపులైన్లు బాగు చేయరూ..

గజపతినగరం: గజపతి నగరంలోని పురిటిపెంట రైల్వే కాలనీలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు గత ఏడాదిలో ఏర్పాటుచేసిన ఈ పైపులన్నీ పాడయ్యాయి. అక్కడక్కడ లీకేజీ అవ్వడంతో తాగునీరు వృథా అవుతోంది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పురిటిపెంట రైల్వే కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

గడ్డివాములు దగ్ధం

దత్తిరాజేరు: దాసుపేట గ్రామంలో రాపాక కనవయ్య, పెదపల్లి తవిటయ్యలకు చెందిన రెండు గడ్డివాములు మంగళవారం దగ్ధమయ్యాయి. అందిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. పశుగ్రాసం కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాములను ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఫైర్ ఎస్‌ఐ ఎంఎస్‌వీ రవిప్రసాద్ తెలిపారు. సుమారు రూ.30వేల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు.


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

అకాల వర్షంతో ఊరట


గజపతినగరం, గంట్యాడ: వర్షం కురుస్తున్న దృశ్యం

గజపతినగరం: గత వారం రోజులుగా ఎండ వేడిమికి విలవిలాడిన ప్రజలకు మంగళవారం అకాల వర్షంతో కొంత ఊరటనిచ్చింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు గురైన ప్రజలకు సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం మామిడికి మేలు చేకూరుస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ● **గుర్ల:** మండలంలోని పలుచోట్ల మంగళవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులతో పాటు ప్రజలకు కొంత ఊరట లభించింది. ● **గంట్యాడ:** మండలంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

రాజాం: రాజాం పట్టణంలో శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో భక్తులకు ఇబ్బంది లేకుండా పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు దగ్గరుండి పారిశుధ్య పనులు పరిశీలించారు. మంగళవారం భారీ వర్షం కురవడంతో అధ్వాన పరిస్థితి ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. వర్షం కారణంగా కాలువల్లో కొట్టుకొచ్చిన చెత్తను తొలగింజేశారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని అమ్మకాలు సాగిస్తున్న వారిపైన, అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపైన అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని టీడీపీ జిల్లా మహిళా అధికార ప్రతినిధి, నగర పంచాయతీ ఒకటో వార్డు కౌన్సిలర్ కింతాడ కళావతి డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. గాంధీనగర్ కాలనీలో ఓ వైసీపీ నాయకుడు 20 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇప్పటికే 10 సెంట్ల స్థలాన్ని అమ్మకాలు చేశారని, మిగిలిన పది సెంట్ల స్థలాన్ని అమ్మకం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అలాగే ఒక వైసీపీ కౌన్సిలర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని షెడ్ నిర్మించారని చెప్పారు. ఈ రెండు ఆక్రమణలపైన రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కళావతి డిమాండ్ చేశారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

నెల్లిమర్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేసేందుకు ఉద్యోగులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.రామారావు సూచించారు. మండలంలోని సీతారామునిపేట, రామతీర్థం, సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. కోడ్ నిబంధనలపై సచివాలయ ఉద్యోగులకు వివరించారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న పోస్టర్లు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, రాజకీయ నాయకులు ఫొటోలు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు.


కొత్తపేటలో పర్యటిస్తున్న ఎంపీడీవో

కనకదుర్గమ్మ ఆలయ స్థానం మార్పు

గంట్యాడ: కొటారుబిల్లి కనకదుర్గమ్మ ఆలయ స్థానాన్ని మార్పు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగరం నుంచి ఎస్.కోటకు వెళ్లే రహదారి పక్కనే కొటారుబిల్లి గ్రామం వద్ద ఆలయం ఉంది. రామవరం నుంచి చిలకలగెడ్డ వరకు రహదారిని విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ఆలయాన్ని మార్పు చేయాల్సి ఉందని హైవే అధికారులు, ఆలయ నిర్వాహకులకు సూచించారు. దీంతో ఆలయం వేరే చోటకు మార్పు చేయాలంటే నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు ప్రభుత్వం రూ.35లక్షలు నిధులు మంజూరు చేయడంతో ఆలయాన్ని కొటారుబిల్లి గ్రామానికి వెళ్లే రహదారి వైపు మార్పు చేసేందుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేశారు. దీంతో బుధవారం అమ్మవారి విగ్రహానికి జీర్ణోద్ధరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు చేస్తున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం

గుర్ల: గుర్లలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


హోమం చేస్తున్న దృశ్యం

పోలీసుల కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

తెర్లాం: ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీసులు మంగళవారం కవాతు చేశారు. రాజయ్యపేట, తెర్లాం గ్రామాల్లో ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో ఈ కవాతు చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ప్రశాంతంగా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరో.. జాతర

- పలు ప్రాంతాల్లో ఘనంగా అమ్మవారి ఉత్సవాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతరల జోరు కొనసాగుతున్నది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎల్లారమ్మ జాతరలు వైభవంగా సాగుతున్నాయి. రాజాంలోని పోలిపల్లి పైడితల్లమ్మ, చీపురుపల్లిలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెలలో జిల్లా కేంద్రంలో సూకాలమ్మ పండుగ జరగనుంది. అలాగే ఎల్.కోట మండలంలో కొట్యాడ అచ్చిమాంబ తీర్థం, వేపాడ మండలంలో సోంపురం ముచ్చిమాంబ తీర్థం, ఎల్.కోట మండలంలో శ్రీరామనవమికి ఓ తీర్థం ఉంటుంది.


చీపురుపల్లి: కోటదుర్గమ్మ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు


రామభద్రపురం: అమ్మవారి ఘటాలకు మొక్కుతున్న భక్తులు

ఐదుగురు అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు

చీపురుపల్లి: పట్టణంలో వెలసిన ఐదుగురు అమ్మవార్లను భక్తులు మంగళవారం దర్శించుకున్నారు. శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర చివరి రోజున స్థానికంగా ఉన్న ఐదుగురు అమ్మవార్లను దర్శించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ మేరకు మంగళవారం ఉదయాన్నే భక్తులు అసిరితల్లి, కోటదుర్గమ్మ, భగీరథమ్మ, సంతానలక్ష్మి, ఎల్లమాంబలను దర్శించి మొక్కులు చెల్లించారు. వీరితో పాటు వంగపల్లిపేటలో ఉన్న కనకమహాలక్ష్మి, సత్యవతమ్మ పేరంటాలు, దుర్గాబంగారు తల్లి ఆలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వడ్డిపేటలో గౌరిమాంబ తీర్థం

లక్కవరపుకోట (కొత్తవలస): తుమ్మికాపల్లి పంచాయతీ శివారు వడ్డిపేటలోగల మంగళ గౌరిమాంబ తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి 24 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నాగార్జున

చీపురుపల్లి: పట్టణంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, పారేపాక సురేష్, పైల బలరాం, శనపతి శ్రీనివాసరావు, గంట్యాడ సత్యనారాయణ, రెడ్డి లక్ష్మణరావు, మీసాల నవీన్, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఉన్నారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సూరు వెంకటకుమార్, ఈవో జి.శ్రీనివాస్ నాగార్జునకు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న నాగార్జున

వైభవంగా చినమ్మతల్లి పండుగ

రామభద్రపురం: మండల కేంద్రంలో మంగళవారం చినమ్మతల్లి పండుగ వైభవంగా జరిగింది. అమ్మవారిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు దర్శించుకున్నారు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పోలిపల్లి పైడితల్లిని దర్శించుకున్న రామ్‌మల్లిక్‌నాయుడు

రాజాం: శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు మంగళవారం శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు దుప్పలపూడి నాగేశ్వరరావు, టంకాల దిలీప్, పెంకి చైతన్యకుమార్, రాము, శాసపు కేశవనాయుడు, టంకాల వెంటేషం ఉన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న రామ్‌మల్లిక్‌నాయుడు

ఐకమత్యంతో పనిచేద్దాం

వేపాడ: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి విజయానికి ఐకమత్యంతో పని చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు పిలుపునిచ్చారు. బానాదిలో గల తన స్వగృహంలో మంగళవారం మండల పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప మాట్లాడుతూ రానున్న పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎవరు పోటీ చేసినా గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు గుమ్మడి భారతి, జనపరెడ్డి ఈశ్వరరావు, గొర్లె నాగరాజు, శిరికి రమణ, సేనాపతి గణేష్, అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గొంప వెంకటరావు

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని పూలతో అలంకరించిన దృశ్యం

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ చదురుగుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. చదురుగుడి వద్ద హోమం చేశారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి దూరం

రామభద్రపురం: అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించవచ్చని మండల అభివృద్ధి అధికారి చుక్కా ఈశ్వరమ్మ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో దుప్పలపూడిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలో కఫం పరీక్షలు చేయించాలని సూచించారు. ఆరు నెలల పాటు సక్రమంగా మందులు వాడితే ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చని తెలిపారు. పెద్దవాళ్లు వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్లికేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఇన్‌చార్జి కార్యదర్శి అడపా ఈశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ పొట్నా కిశోర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● **తెర్లాం:** క్షయ వ్యాధి వారోత్సవాలలో భాగంగా కూనాయవలస గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెర్లాం పీహెచ్‌సీ అధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ దివ్యభారతి పాల్గొన్నారు. అనంతరం టీబీ యూనిట్ పర్యవేక్షకుడు బి.రమేష్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500 వంతున ఆన్‌లైన్‌లో ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు, ఫార్మసిస్టు నాగేశ్వరరావు, రాధ, కార్యదర్శి మీసాల స్వామి తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: ర్యాలీ చేస్తున్న దృశ్యం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వేపాడ: మండలంలోని బొద్దాం, పాటూరు, రామస్వామిపేట గ్రామాల్లోగల పోలింగ్ కేంద్రాలను వల్లంపూడి ఎస్‌ఐ కె.రాజేష్ మంగళవారం పరిశీలించారు. ఈ కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజేష్

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చొరవ

- అరకు నియోజకవర్గ బీసీసెల్ టీడీపీ అధికార ప్రతినిధి సత్యనారాయణ

గరుగుబిల్లి: గిరిజన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిస్తామని అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ టీడీపీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం చిలగాంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన గిరిజన ఐక్య వేదిక ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజనుల అభివృద్ధికి అవసరమైన నివేదికలు తయారుచేసి బీజేపీప్రతినిధి, లోక్‌సభమాజీసభ్యురాలు కొత్తపల్లి గీతకు అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఆదివాసీ సంఘం కార్యదర్శి బి.రామారావు, గిరిజనాభ్యుదయ సంఘం ప్రతినిధి ఆరిక చంద్రశేఖర్, కోలక గౌరమ్మ, బీజేపీ కార్యదర్శి మణిభూషణరావు, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దుక్క సీతారాంతో పాటు పలువురు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సత్యనారాయణకు సమస్యలు వివరిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

'కార్యకర్తలంతా ముందుండి గెలిపించాలి'

జియ్యమ్మవలస: ఇండియాకూటమిలో భాగంగా అరకు పార్లమెంట్, కురుపాం శాసనసభ నియోజకవర్గాల్లో సీపీఎం పోటీ చేస్తుందని, కార్యకర్తలంతా ముందుండి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కొల్లి గంగునాయుడులు తెలిపారు.మంగళవారం జియ్యమ్మవలసలో సీపీఎంకార్యకర్తల సమావేశం జరిగింది.సీపీఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గరుగుబిల్లి శ్రీను, ఎం.రామారావు, సోమయ్య పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలోని వైద్య ఆరోగ్య కార్యాలయంలో జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అర్జీలను ఉద్యోగుల నుంచి స్వీకరించారు. వీటిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అర్జీలను స్వీకరిస్తున్న జగన్నాథరావు

నగదు తరలింపుపై దర్యాప్తు చేయాలి

- కృష్ణపల్లి తెలుగు యువ నాయకుడు గణేష్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: నగదు తరలింపుపై పూర్తిస్థాయిలో అధికారులు దర్యాప్తు నిర్వహించాలని కృష్ణపల్లి తెలుగుయువ నాయకుడు గణేష్ కోరారు. తమ గ్రామంలో వలంటీర్లు, గృహసారథులకు నగదు పంపిణీకి ఓ వైసీపీ నాయకుడు గ్రామానికి వచ్చాడని తెలిపారు. ఓ వైసీపీనాయకుడి ఇంట్లో సమావేశం నిర్వహించారని మంగళవారం రాత్రి గణేష్ ఆంధ్రజ్యోతికి వివరించారు. నగదు పంపిణీకి ప్రణాళికలు జరుగుతున్నాయని, ముందుగా వలంటీర్లకు నగదు ఇచ్చేందుకు ఓ వైసీపీనాయకుడు డబ్బుతో గ్రామానికి వచ్చినట్లు సమాచారం అందడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని చెప్పారు.ఆయన స్పందించి ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాన్ని పంపించారని తెలిపారు. ఆబృందం అధికారులు రాగానే ఓ వ్యక్తి గోడ దూకి వెళ్లిపోవడంతోపాటు నగదును అక్కడ నుంచి తరలిచారని ఆరోపించారు.

ఫిర్యాదుతో గ్రామంలో తనిఖీలు

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లిలో ఓ వైసీపీ నాయకుని ఇంట్లో కొంతమంది వలంటీర్లు సమావేశం నిర్వహిస్తున్నారని, నగదు పంపిణీకి ప్రణాళిక సిద్ధంచేస్తున్నారని కొంతమంది గ్రామస్థులకు తెలియడంతో వెంటనే ఈ విషయంపై ఎంపీడీవో షేక్‌మహమ్మద్ అకీబజావీదకు ఫిర్యాదుచేశారు. ఎంపీడీవో వెంటనే స్పందించి ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాన్ని గ్రామానికి పంపించారు. అయితే పూర్తిగా తనిఖీలు నిర్వహించిన అనంతరం అక్కడ ఎటువంటి కార్యక్రమాలు జరగడం లేదని ఫ్లైయింగ్ స్క్వాడ్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా ఫిర్యాదు రావడం వాస్తవమేనని, కానీ అక్కడ వీడియోలతో సహా ఫొటోగ్రఫీ చేశామని ఎంపీడీవో ఆంధ్రజ్యోతికి తెలిపారు. అక్కడ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమం జరగడం లేదని ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందం తెలియజేశారని, ఈ విషయంపై బుధవారం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

మక్కువ: మండలంలోని డి.సిర్లము సమీపంలో సువర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. సమాచారం మేరకు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించినట్టు చెప్పారు.ఈ మేరకు ఇందుపురం గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణ, పుత్తూరు గ్రామానికి చెందిన మూడడ్ల ప్రదీప్, పార్వతీ పురం మండలంలోని పెదబొండపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. ఈ ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'హామీలు తుంగలో తొక్కారు'

పాలకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ తుంగలోకి తొక్కిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కార్యదర్శి కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తెలిపారు. మంగళవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలు రద్దు చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో సీహెచ్ సంజీవి, ఎ.లక్ష్మణరావు, జి.సారిక, బి.వాణి పాల్గొన్నారు.